క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ సిటీ: విజయవాడ ఆక్టోపస్ నుంచి బదిలీపై కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం. నాగేంద్రరావు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కనక మహాలక్ష్మికి జన్మ నక్షత్ర పూజలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

బోట్‌క్లబ్: నగరంలోని ద్వారకానగర్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం జన్మ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండవీటి బ్రహ్మయ్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అఖండ జ్యోతిని మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు(బున్ని) వెలిగించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి, ప్రముఖ వ్యాపారవేత్త అంకంరెడ్డి రామునాయుడు సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందించారు. ఆలయ ఈఓ పి.కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు దమ్మాల జగన్, మల్లిపూడి రాము, దమ్మాల చిన్న, వేంకటేశ్వరరావు, మెర్నీడి సత్తిబాబు, అంకంరెడ్డి సత్యవతి పాల్గొన్నారు.

హోంగార్డులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న హోంగార్డులు

కాకినాడ క్రైం: కానిస్టేబుల్ పరీక్షల కోసం ప్రముఖ పోలీస్ ఉద్యోగాల శిక్షణా సంస్థ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్యాం ఉచిత స్టడీ మెటీరియల్‌ను హోంగార్డులకు సమకూర్చారు. మొత్తం 13 పుస్తకాల కిట్‌ను ఎస్పీ బిందుమాధవ్ కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అభ్యర్థులకు అందజేశారు. వీరు గత నెలలో జరిగిన దేహదారుఢ్య పరీక్షలలో అర్హత సాధించారు. స్టడీ మెటీరియల్ సమకూర్చిన శ్యాంకు అధికారులు, అభ్యర్థులు ధన్యవాదాలు తెలిపారు.

మానవ సేవే సరైన జీవన విధానం

బోట్‌క్లబ్: భారతీయ జన సంఘ్ మాజీ అధ్యక్షుడు దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక రామారావుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని నిరూపించిన మహోన్నత వ్యక్తి పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని కొనియాడారు. వ్యక్తివాదం, సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం వంటి పాశ్చాత్య భావనలపై భారతదేశం ఆధారపడరాదని చెప్పారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరప: భారతీయ జన సంఘ్ పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి ఉప్పలంకలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షురాలు ఎర్రంనీడి పద్మావతి ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సినిమాలు



దేవీ మల్టీప్లెక్స్	: తండేల్, పట్టుదల, సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్
ఆనంద్ సినిమాస్	: తండేల్, పట్టుదల, సంక్రాంతికి వస్తున్నాం, పుష్ప–2
పద్మప్రియ	: తండేల్
శ్రీప్రియ	: డాకు మహారాజ్
తిరుమల	: సంక్రాంతికి వస్తున్నాం
లక్ష్మి	: తండేల్
సత్యగౌరి	: ఒక పథకం ప్రకారం
సీఅండ్‌సీ	: గేమ్ చేంజర్
సీఅండ్‌సీ–2	: మదగజరాజ

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

- ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- విద్యా సామర్థ్యాల మేరకు గ్రేడ్ల విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ



టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

బాలాజీచెరువు: పదో తరగతి పరీక్షలు దగ్గర పడటంతో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ అధికారులు సన్నద్ధమతున్నారు. ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక అమలులో ఉండటంతో, దానిని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. కాకినాడ నగరంలో మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 14, ప్రభుత్వ పాఠశాలలు నాలుగు, జిల్లా పరిషత్ ఒకటి, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు రెండు, ఎయిడెడ్ స్కూళ్లు మూడు కలిపి మొత్తం 24 పాఠశాలలున్నాయి. వీటి నుంచి 2,290 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో బాలురు 1,005 మంది ఉండగా, బాలికలు 1,285 మంది ఉన్నారు. అత్యధికంగా సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల నుంచి 282 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

సన్నద్ధం ఇలా..

పాఠశాలల్లో 2024–25 పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారిని నాలుగు గ్రేడ్లుగా విభజించారు. ఏ–గ్రేడ్‌లో 550 నుంచి 600 మార్కులు తెచ్చుకునే సామర్థ్యం ఉన్నవారు, బి–గ్రేడ్‌లో కొంచెం మెరుగైన వారు, సీ–గ్రేడ్, డీ–గ్రేడ్‌లలో కొంచెం వెనుకబడిన వారిని విభజించారు. ప్రతి రోజూ ఆయా పాఠశాలల్లో వీరికి ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

పది మందికి ఓ ఉపాధ్యాయుడు

ప్రతి ఉపాధ్యాయుడు పది మంది విద్యార్థులకు బాధ్యులుగా నిర్ణయించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదివించేలా ప్రత్యేక దృష్టి పెట్టారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు రోజూ సాయంత్రం కొంత మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. గతంలో మెరుగైన ఫలితాలు సాధించామని, ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని కాకినాడ మండల విద్యా శాఖాధికారి చెవ్వూరి రవి తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకుంటున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో వెనుకబడిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

– చందన లహరి, పదో తరగతి, సాలిపేట బాలికల పాఠశాల

చాలా ఉపయోగం



పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులతో చాలా ఉపయోగం ఉంది. అడిగిన డౌట్ క్లారిఫై చేస్తున్నారు. ఇళ్లను కూడా సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. రోజూ నిర్వహించే పరీక్షల్లో వచ్చే మార్కులు, చదివే విధానంపై చర్చిస్తున్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషితో ఉత్తమ మార్కులు సాధిస్తాం.

– మహాలక్ష్మి, విద్యార్థిని, పదో తరగతి

మంచి ఫలితాలు సాధిస్తాం



ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయులందరూ ప్రత్యేక తరగతులు నిర్వహించి, మాకు మంచి గైడెన్స్ ఇస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో ప్రత్యేక తరగతులతో పాటు, నిరంతర పర్యవేక్షణ, ముఖ్యంగా ఇంటికి ఫోన్ చేసి చదువుతున్నారా, లేదా అని ఎంక్వైరీ చేస్తున్నారు.

– శైలజ, విద్యార్థిని, పదో తరగతి

ఫ్లెక్సీని తొలగించిన ఎంపీడీఓ



పెద్దాపురప్పాడులో ముఖద్వారం వద్ద ఫ్లెక్సీ తొలగించాక..

కరప: మండలంలోని పెద్దాపురప్పాడులో ముఖద్వారం వద్ద పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని ఎంపీడీఓ ఎం.అనుపమ తొలగించారు. 'సాక్షి'లో 'ఎన్నికల కోడ్ ఎక్కడ?' శీర్షికన మంగళవారం ప్రచురితమైన వార్తకు ఎంపీడీఓ స్పందించారు. పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి పి.వీరభద్రరావుతో కలిసి పెద్దాపురప్పాడు గ్రామానికి వెళ్లి ఆ ఫ్లెక్సీని తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె వివిధ పార్టీల నాయకులకు స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎక్కడ కూడా ఫ్లెక్సీలు ఉండరాదని, ఏమైనా ఉంటే వెంటనే తొలగించాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

పొలాలకు సాగు నీరు విడుదల



విజయరాయుడుపాలెంలో పొలాలను పరిశీలిస్తున్న ఎంఏఓ రాజేష్

కరప: సాగు నీరందక ఎండిపోతున్న పొలాలను పరిశీలించేందుకు వ్యవసాయాధికారులు మంగళవారం మండలంలోని విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. 'సాక్షి'లో 'నేల తడారి.. చేలు ఎడారి' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు(జేడీఏ) ఎస్.విజయ్‌కుమార్ స్పందించారు. కరప మండలంలో పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సాగునీటి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఎంఏఓ ఏవీ రాజేష్‌ను ఆయన ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంఏఓ రాజేష్ విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు తదితర గ్రామాల్లో పర్యటించి, సాగునీటి సమస్యపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇలాఉండగా వెల్ల నార్త్ కెనాల్‌కు ఇరిగేషన్ అధికారులు నీటిని వదిలినట్టు ఎంఏఓ రాజేష్ తెలిపారు. బుధవారానికి మరింతగా నీటిని విడుదల చేస్తారని, పొలాలన్నీ తడిసేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు. కరప భూములకు వచ్చే న్యూభీమన్న కర్ర కాలువ, గరువు కాలువల్లో నీటి మట్టం పెరగలేదని, ఆక్వా చెరువులకు నీటిని తోడేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని శివారు భూముల రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు పరిశీలించి వెళ్లడం కాకుండా, కాలువల్లో నీటిమట్టం పెంచి, శివారు భూములన్నీ తడిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్నెట్‌కు పరిమిత సమయం కేటాయించాలి

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్‌కు పరిమిత సమయం కేటాయించాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఈ ఏడాది మెరుగైన ఇంటర్నెట్ కోసం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామని, ఐఎస్ఈఏ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ఆంధ్రా యూనివర్సిటీతో పాటు, జేఎన్‌టీయూ కాకినాడలో దీనిని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా సైబర్ భద్రత, సురక్షితమైన ఆన్‌లైన్ అభ్యాసాలపై విభిన్న ఇంటర్నెట్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రతి రోజూ గంట సమయం ప్రకృతితో పాటు, స్నేహితులతో గడిపితే.. ఇంటర్నెట్‌కు పరిమిత సమయం కేటాయించవచ్చన్నారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 50 విద్యాసంస్థలను ఎంపిక చేయగా, అందులో జేఎన్‌టీయూకే ఉండటం సంతోషదాయకమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఐదేళ్ల పాటు ఏటా రూ.50 లక్షల పైచిలుకు నిధులతో సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్, ఫిన్‌టెక్నాలజీ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే రూ.40 లక్షలతో సీఎస్ఈలో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, సీఎస్ఈ హెడ్ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, ప్లాంట్ డాక్టర్స్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: ఏపీ వ్యవసాయ అధికారుల సంఘం కాకినాడ జిల్లా శాఖ రూపొందించిన 2025 క్యాలెండర్, ప్లాంట్ డాక్టర్స్ డైరీని కలెక్టర్ షణ్మోహన్ సగిలి, వ్యవసాయ శాఖ జేడీ ఎస్.విజయకుమార్ కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలో విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కాకినాడ క్రైం: కర్ణాటక రాష్ట్రం శృంగేరీ శారదా పీఠంలో పీఠాధిపతి భారతీ తీర్థ, గురువు విధుశేఖర సంయుక్తాధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గీతా జ్ఞాన యజ్ఞ మౌఖిక పరీక్షలో కాకినాడకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. నగరం నుంచి వెళ్లిన పది మంది విద్యార్థుల్లో ఎనిమిది మంది తొలి స్థానాలు, ఒకరు ద్వితీయ, మరొకరు తృతీయ స్థానంతో అత్యుత్తమ ప్రదర్శన చూపారు. వీరంతా కాకినాడకు చెందిన సనాతన ధార్మిక సేవా సంస్థ గీతా విహార్‌కు చెందినవారు. గురువు డాక్టర్ గ్రంధి గీతా మణి సహా, ప్రతిభ చూపిన విద్యార్థులు కలిదిండి నీలిమ, పాతూరి శ్రీనిత్య ప్రకాశిని, బొండా కమీల, సాలగ్రామ తేజస్విని, దుడ్డిపూడి రిత్విక్, కంచెర్ల రత్నశ్రీ, భాగవతుల నాగసూర్య శిరీష, చోడవరపు రాజ్యలక్ష్మి, నాళం సత్య, ప్రియాన్షీ చటర్జీలు పీఠాధిపతి భారతీ తీర్థ నుంచి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఈ బృందానికి రూ.2 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని పీఠం ప్రతినిధులు అందించారు.

డాక్టర్ అడ్డాల సేవలు అభినందనీయం



డాక్టర్ అడ్డాలను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: వైద్యుడిగా, సామాజిక కార్యకర్తగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రమణయ్యపేటలో డాక్టర్ అడ్డాలను ఘనంగా సత్కరించారు. ఇటీవల చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జరిగిన జాతీయ దంత వైద్యుల సదస్సులో డాక్టర్ అడ్డాల రెండోసారి జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పేదలకు నిరంతరం సేవలందిస్తున్న ఆయన సామాజిక కార్యకర్తగా ముందుంటారని వెంకటేశ్వరరావు అభినందించారు. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో ఆయన విశేష సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు గానం అజరామరమని అల్లూరి సీతారామరాజు కళావేదిక గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం సమీపంలోని ఘంటసాల విగ్రహం వద్ద కళావేదిక, ఘంటసాల కళాపీఠం సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకూ ఘంటసాల పాటలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఘంటసాల సినీ ప్రపంచానికి అందించిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళావేదిక ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, గాయకులు బాబీ, టీవీవీఎస్ఎన్ రెడ్డి, కరక రాజుబాబు, పుల్లారావు, బాపిరాజు, ఉండవిల్లి రంగారావు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



యండమూరులో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కరప: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వంశ పారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి, బాణసంచా కాల్పులు, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివార్లను దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. దేవదాయ శాఖ ఈఓ ఏఆర్వీ అపర్ణ, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామస్తులు రథోత్సవంలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

కార్మిక సంఘ బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాకినాడ సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని సంఘ రాష్ట్ర కోశాధికారి పీవీ మోహన్, రాష్ట్ర కార్యదర్శులు గంగాధర్, పద్మ తెలిపారు. స్థానిక ఎన్‌జీవో హోంలో యూనియన్ కాకినాడ డిపో యూనిట్ సమావేశం మంగళవారం సాయంత్రం జరిగింది. వారు మాట్లాడుతూ, ఎన్ఎంయూఏ సంఘటిత పోరాటాల ఫలితంగా ఆర్టీసీ కార్మికులకు బకాయిలలో 25 శాతం చెల్లింపులు చేయాలని ఆర్టీసీ ఎండీ ఆదేశించారన్నారు. ఆయనకు యూనియన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో యూనియన్ జిల్లా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఓఆర్ రాంబాబు, రమణరాజు, ఏవీ రావు, ప్రసాద్, కె.గోవింద్, బీవీ చక్రం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును కేబినెట్‌లో ప్రవేశపెట్టాలి

సామర్లకోట: రాష్ట్ర కేబినెట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు వల్లూరి నాని మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణకు కేంద్రం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం రాత్రి పెన్షన్ లైన్‌లో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాని మాట్లాడు తూ, తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు కేబినేట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు కళ్లెం

ఎన్ఐసీ డీఐఓ సుబ్బారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐఓ సుబ్బారావు



హాజరైన ఉద్యోగులు

కాకినాడ సిటీ: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలను కొద్దిపాటి అప్రమత్తతతో కాపాడుకోవచ్చని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ సీహెచ్‌వీవీఎస్ సుబ్బారావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశ మందిరంలో నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్నెట్ వినియోగంలో కొద్దిపాటి అప్రమత్తత ద్వారా సమాచారాన్ని వేరొకరికి చేరకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ.. టు గెదర్ ఫర్ బెటర్ ఇంటర్నెట్ అనే నినాదంతో, ప్రజలు సురక్షితంగా ఇంటర్నెట్ వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఏటా ఫిబ్రవరిలో రెండో మంగళవారాన్ని ఇంటర్నెట్ సేఫ్ డేగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమం కింద ఇంటర్నెట్ వినియోగించే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రజలు తమ ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు, బయోమెట్రిక్ వంటి విలువైన, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికైనా ఇచ్చే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా నిర్వహించే ఇంటర్నెట్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కార్యాలయ సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, చాలా నేరాలు అప్రమత్తంగా లేకపోవడం వల్లే జరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయితే.. తెలియకుండానే మరో వ్యక్తి గమనిస్తున్నాడని తెలుసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే లింక్‌లపై క్లిక్ చేసే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. రివార్డు పాయింట్లు, డిస్కౌంట్లు అంటూ మోసపూరిత మెసేజ్‌లకు ఆకర్షితులై విలువైన, వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

కోర్టు ఫీజు స్టాంపులు విడుదల చేయాలి

కాకినాడ లీగల్: ఏడాది కాలంగా కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కోర్టు ఫీజు స్టాంపుల కొరత ఉందని, వీటిని వెంటనే విడుదల చేయాలని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో కేసులకు సంబంధించి దాఖలు చేసే ప్రతి పిటీషన్‌పై కోర్టు ఫీజు స్టాంపులు అంటించాల్సి ఉందన్నారు. కాకినాడలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కోర్టు ఫీజు స్టాంపులు లేకపోవడం వల్ల న్యాయవాదులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కోర్టు ఫీజు స్టాంపులను ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రైవేటు వ్యక్తులు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. కోర్టు ఫీజు స్టాంపులు వెంటనే విడుదల చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లినా సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. కోర్టు ఫీజు స్టాంపులు వెంటనే విడుదల చేయాలంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రికి, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి, డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్లకు లేఖలు రాసినట్టు తెలిపారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ మహిళ నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు నార్త్ స్టేషన్ ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.